సాక్షి మహబూబాబాద్

ఆదివారం | 19 | ఫిబ్రవరి | 2023



మన పోలీసింగ్ దేశానికే ఆదర్శం

శాంతి భద్రతల పరిరక్షణలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు.

- 8లో▸



కేసీఆర్ ప్రధాని కావాలని పూజలు

ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు దేశ ప్రధాని కావాలని కోరుకుంటూ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
34.0^0 / 18.0^0

వాతావరణం

జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో ఉదయం కాస్త చలి ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉండి, సాయంత్రం మళ్లీ చలి ప్రారంభం అవుతుంది.

న్యూస్‌రీల్

కేసముద్రంలో షిర్డీ ఎక్స్‌ప్రెస్ హాల్టింగ్



కేసముద్రం: కేసముద్రం రైల్వేస్టేషన్‌లో నూతనంగా షిర్డీ ఎక్స్‌ప్రెస్‌కు శనివారం హాల్టింగ్ కల్పించారు. ఈ మేరకు కాకినాడ నుంచి షిర్డీకి బయల్దేరిన సాయినగర్ షిర్డీ ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 2.20 గంటలకు కేసముద్రం రైల్వేస్టేషన్‌కు చేరుకోగా, స్థానిక ప్రజలు, బీజేపీతోపాటు, వివిధ పార్టీల, సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, వ్యాపారులు ఘనస్వాగతం పలికారు. ఎక్స్‌ప్రెస్ రైలు ముందుభాగంలో మామిడి తోరణాలతో అలంకరించారు. రైల్వే అధికారులకు, సిబ్బందికి స్వీట్లను పంచిపెట్టారు. ఈ సందర్భంగా కేంద్ర రైల్వేశాఖ మంత్రి, ఉన్నతాధికారులకు బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జాటోత్ హుస్సేన్ నాయక్ కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ బట్టు శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచందర్ రావు, మండల అధ్యక్షుడు నర్సింహరెడ్డి, శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, మాధవపెద్ది శశివర్ధన్ రెడ్డి, వెంకటాచారి, వెంకట్‌రెడ్డి, నాగేశ్వ రాచారి, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి పొదుపు ఖాతాల మహామేళా




మహబూబాబాద్: మానుకోట సబ్‌డివిజన్ పరిధిలో ఈనెల 20 నుంచి 24వ తేదీ వరకు పోస్టాఫీస్ పొదుపు ఖాతాల మహామేళాను నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ అసిస్టెంట్ పోస్ట్ సూపరింటెండెంట్ సైదానాయక్ తెలిపారు. స్థానిక ప్రధాన తపాలా కార్యాలయంలో శనివారం ఉద్యోగులందరికీ పొదుపు ఖాతాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించిన అనంతరం పొదుపు ఖాతాలపై పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పొదుపు ఖాతాల మహామేళాకు మానుకోట సబ్ డివిజన్ పరిధిలో 5,000 పోస్ట్ ఆఫీస్ పొదుపు ఖాతాలు తెరువాలనే లక్ష్యంతో ప్రణాళిక తయారు చేసుకున్నామన్నారు. పోస్టల్ బ్యాంక్ ఖాతా ద్వారా ఇంటర్‌నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, సదుపాయం ఉందని తెలిపారు. వినియోగదారులు పోస్టాఫీస్ బ్యాంక్ పొదుపు ఖాతాలను ఆన్‌లైన్ ద్వారా తీసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో రాంచందర్, కోట సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

బ్రహ్మకుమారీస్ సెంటర్‌లో శివలింగానికి క్షీరాభిషేకం



మహబూబాబాద్ రూరల్: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం కేంద్రంలో శనివారం 108 శివలింగాల దర్శనం, శివలింగానికి క్షీరాభిషేకం పూజా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, డాక్టర్ సీతామహాలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రాంమోహన్ రెడ్డి, డాక్టర్ సౌజన్య దంపతులు ముఖ్యఅతిథులుగా హాజరై శివలింగాలను దర్శించుకుని పూజలు చేశారు. శివలింగ క్షీరాభిషేకం ద్వారా మహాశివుడిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ ఫరీద్, యాళ్ల మురళీధర్‌రెడ్డి, సాధన, మున్సిపల్ వార్డు కౌన్సిలర్ గుండా స్వప్నరాజశేఖర్, పీఏసీఎస్ చైర్మన్ నాయిని రంజిత్, తేళ్ల శ్రీనివాస్, లూనావత్ అశోక్, బ్రహ్మకురీస్ సెంటర్ నిర్వాహకురాలు సుజాత, సభ్యులు పాల్గొన్నారు.

అన్నదాన కార్యక్రమానికి విరాళం



మహబూబాబాద్ రూరల్ : జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వర్ల బజార్లో గల వెంకటేశ్వర స్వామి వారి దేవాలయంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి కందగట్ల విజయకుమార్, సరస్వతి, కుటుంబ సభ్యులు విరాళం అందజేశారు. విరాళంగా రూ.1,00,111 శనివారం అందజేసిన అనంతరం దాతలు మాట్లాడుతూ.. అన్నదానం కోసం సాయం అందించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు గద్దె రవి, అధ్యక్షుడు అలిగువెల్లి వీరభద్రం పాల్గొన్నారు.



కురవి: భద్రకాళి సమేత వీరభద్రస్వామి కల్యాణాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తజనం

సర్వం.. శివోహం

- వైభవంగా మహాశివరాత్రి వేడుకలు
- మార్మోగిన శైవక్షేత్రాలు

కురవి: మహాశివరాత్రి పర్వదినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి కల్యాణ మహోత్సవానికి రాష్ట్రం నలుమూలల నుంచి శనివారం భక్తులు తరలివచ్చారు. వీరభద్రస్వామి నామస్మరణలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఆలయం ఎదుట, స్వామి, అమ్మవారి ఆలయాల్లో భారీ క్యూలు ఏర్పాటు చేయడంతో భక్తులు బారులుదీరారు. బలిహారణ స్వామి శావ ఆలయం చుట్టు భక్తులు ప్రదక్షిణలు చేశారు. జాతరకు వచ్చే భక్తులకు ఆలయ చైర్మన్ బాదావత్ రామునాయక్, ఈఓ సత్యనారాయణలు అన్ని ఏర్పాట్లు చేశారు.

ఆర్టీసీ సేవలు..

శ్రీవీరభద్రస్వామి కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు తరలివచ్చే భక్తుల కోసం మహబూబాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ విజయ్ ఆధ్వర్యంలో సూర్యాపేట, ఖమ్మం, నర్సంపేటల నుంచి ప్రత్యేకంగా బస్సులు నడిపించారు. మొత్తంగా 230 సర్వీసులకు తోడు మరో 13 సర్వీసులు అదనంగా నడిపించారు.

వైద్య సేవలు...

డీఎంహెచ్‌ఓ డాక్టర్ హరీశ్‌రాజ్ ఆధ్వర్యంలో జాతరలో భక్తులకు వైద్యసేవలందించారు. నాలుగు క్యాంపులు ఏర్పాటు చేశారు. క్యాంపులను డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు ఉమాగౌరీ, అంబరీష పర్యవేక్షించారు. కార్యక్రమంలో డాక్టర్లు విరాజిత, శ్రీనివాస్, నరేష్, స్రవంతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల బందోబస్తు..

ఎస్పీ శరత్‌చంద్రపవార్ నేతృత్వంలో అడిషనల్ ఎస్పీ చెన్నయ్య, డీఎస్పీ రమణబాబు, సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. 200 వందల మందితోపాటు 50 మంది ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు సేవలు అందించారు. ఎస్పీ శరత్‌చంద్రపవార్ ఆలయంలో డీఎస్పీ,సీఐలతో చర్చించారు.ఇదిలా ఉండగా.. వీరభద్రస్వామిని రాష్ట్ర మంత్రి సత్యవతిరాథోడ్, ఎంపీ కవిత, ఎమ్మెల్యేలు బానోత్ శంకర్‌నాయక్, రెడ్యానాయక్, కలెక్టర్ శశాంక, ఎస్పీ శరత్‌చంద్రపవార్, మహబూబాబాద్ మున్సిపల్ చైర్మన్ రాంమోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ వెంకటరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నవీన్‌రావు, అడిషనల్ కలెక్టర్ అభిలాషఅభినవ్ దంపతులు, ఎంపీపీ పద్మావతి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఫరీద్, బీఆర్‌ఎస్ నాయకులు బజ్జూరి ఉమాపిచ్చిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, తోట లాలయ్య, శ్రీనివాస్‌రెడ్డి, రవినాయక్, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారెడ్డి, నెహ్రూ, శ్రీను దర్శించుకుని పూజలు చేశారు. కాగా, మహబూబాబాద్ లయన్స్‌క్లబ్, చేయూత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో భక్తులకు మజ్జిగ అందచేశారు. ఆలయం ఎదుట శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో తాగునీరు అందచేశారు.

వైభవంగా వేడుకలు

మహబూబాబాద్ రూరల్: మహాశివరాత్రి పర్వదినం, శనిత్రయోదశిని పురస్కరించుకుని శివాలయాల్లో శివలింగ పూజలు, సామూహిక మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, బిల్వార్చన పూజలు శనివారం భక్తులు వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా తెల్లవారుజాము నుంచే భక్తులు శివాలయాల్లో పార్వతీ పరమేశ్వరులను, శివలింగాలను దర్శించుకుని పూజలు నిర్వహించారు. శనిత్రయోదశి రావడం సందర్భంగా భక్తులు శనీశ్వరుడికి అభిషేకాలు, పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. జిల్లాలోని శివాలయాల్లో భక్తులు కుటుంబ సమేతంగా వచ్చి స్వామివారు, అమ్మవార్లను దర్శించుకుని ఉమాచంద్రమౌళీశ్వరస్వామి దేవాలయంలో, పార్వతీ రామలింగేశ్వరస్వామి దేవాలయంలో, భక్త మార్కండేయ శివాలయంలో, స్వయం భూ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో అర్చకులు రంగావఝుల సుధాకరశాస్త్రి, చిట్టా శ్రీకాంత్ శర్మ, కొత్తూరి నర్సింహమూర్తిశర్మ భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు. శివాలయాల్లో శివుడిని, పార్వతీదేవి అమ్మవారిని శోభాయమానంగా అలంకరించారు. మహాశివరాత్రి, శనిత్రయోదశి ఒకేరోజున రావడాన్ని అత్యంత విశిష్టంగా భావించిన భక్తులు బిల్వ (మారేడు)దళాలు, తెల్లజిల్లేడు పూలు, జిల్లేడు ఆకులు సమర్పించి శివుడికి, శనీశ్వరుడికి అభిషేకాలు, అలంకరణలు, అర్చనలు చేశారు.





కొలువుదీరిన భద్రకాళి సమేత వీరభద్ర స్వామి, ప్రత్యేక అలంకరణలో పార్వతీ రామలింగేశ్వర స్వామివారు, (ఇన్‌సెట్‌లో) స్వామివారిని మొక్కుతున్న యువతి

పీకలూది.. బూరలతో ఆడిన మంత్రి సత్యవతి



వీరభద్రస్వామి దర్శనం అనంతరం మంత్రి సత్యవతిరాథోడ్ జాతరలో సందడి చేశారు. దుకాణంలో బొంగు పేశాల ప్యాకెట్లు కొన్నారు. బూరలు(పీక) కొని ఊది భక్తులను ఉత్సాహపరిచారు. బెలూన్లను కొని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కృషి చేస్తున్నారని తెలిపారు. ఆలయంలో మిగిలిన పనులు పూర్తి చేస్తామన్నారు. కురవిలో హరిత హోటల్ ఏర్పాటుకు నివేదిక అందించామని, పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు.

వీరభద్రస్వామి ఎదుర్కోలు



కురవి: ప్రత్యేక శావలో భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామిని అందంగా అలంకరించగా శనివారం రాత్రి 7గంటలకు గ్రామ సేవకు బయల్దేరారు. కల్యాణ వీరభద్రస్వామిని ఒక శావలో, భద్రకాళీ అమ్మవారిని మరో శావలో ప్రతిష్ఠించి ఆలయం చుట్టు ప్రదక్షిణల అనంతరం గ్రామసేవకు వెళ్లారు. గ్రామ పంచాయతీ వద్ద రెండు శావలు విడిపోయాయి. గ్రామంలోని గండిమైసమ్మ వద్ద రెండు శావలు ఎదురెదురుగా వచ్చి కలిశాయి. కల్యాణభద్రుడు, భద్రకాళీ అమ్మవారి తరఫున గ్రామ పెద్దలు కట్నకానుకలను మాట్లాడారు. భక్తులు కాగడాలు వెలిగించి ఎదుర్కోలు నిర్వహించారు. కల్యాణ వీరభద్రుడు, భద్రకాళీ సమేతంగా కల్యాణ మండపానికి చేరుకున్నారు.







కురవి వీరభద్ర ఆలయంలో భక్తుల సందడి, వీరభద్రుడికి పూజలు చేస్తున్న మంత్రి సత్యవతి, ఎమ్మెల్యే శంకర్ నాయక్, కలెక్టర్, ఎస్పీ, మహబూబాబాద్‌లో పార్వతీ రామలింగేశ్వర స్వామి వారి దేవాలయంలో..

పోలీస్‌స్టేషన్‌కు చేరిన కుక్క పంచాయితీ

కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన ఓ బాలుడిని కుక్క కరవడంతో, ఇరువురి కుటుంబాల మధ్య తలెత్తిన గొడవ శనివారం పోలీస్‌స్టేషన్‌కు చేరింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇనుగుర్తికి చెందిన రాజేష్ కుమారుడిని, అదే కాలనీలో ఉంటున్న స్వరూప పెంచుకుంటున్న కుక్క కరిచింది. దీంతో కుక్కను ఇంట్లో కట్టేయకపోవడం వల్లే, తమ కుమారుడిని కరిచిందంటూ వారు ప్రశ్నించడంతో, ఇరువురి మధ్య వివాదం ఏర్పడింది. ఇదిలా ఉండగా కుక్క కరిచిందంటూ తనపై కొందరు దాడి చేసి, ఇంట్లో వస్తువులను ధ్వంసం చేశారంటూ బాధితురాలు స్వరూప కేసముద్రం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మరోవైపు స్వరూప నిర్లక్ష్యం కారణంగానే, తన కుమారుడిని కుక్క కరించిందంటూ ఆ బాలుడి తండ్రి రాజేష్ ఫిర్యాదు చేశాడు. విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

నిట్‌లో ముగిసిన 'క్యూరా-23'

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లోని స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయస్థాయి క్యూరా-23 వేడుకలు శనివారం ముగిశాయి. ఫైనాన్షియల్ ప్లానింగ్ అనే అంశంపై ఏర్పాటు చేసిన సదస్సులో ఆన్‌లైన్‌లో పద్మశ్రీ అవార్డు గ్రహీత, ఆసు యంత్ర ఆవిష్కర్త సీహెచ్.మల్లేషం మాట్లాడారు. తాను పదవ తరగతి వరకు మాత్రమే చదువుకుని ఆసు యంత్రాన్ని కనుగొన్నానని, ఎలక్ట్రానిక్స్ ,మైక్రో కంట్రోలర్ ప్రోగ్రామింగ్‌ను నేర్చుకున్నానని తెలిపారు. ఇంజనీరింగ్ విద్యనభ్యసించిన స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు సమాజానికి తోడ్పడే ఆవిష్కరణలు చేపట్టాలన్నారు. మేనేజ్‌మెంట్ విద్యార్థులు సైతం క్యాంపస్ సెలక్షన్స్‌లో అత్యుత్తమ కంపెనీల్లో ఎంపిక అవుతున్నారని, మారుతున్న కాలానుగుణంగా పరిశోధనలు చేపట్టాలని నిట్ రిజిస్ట్రార్ గోవర్ధన్‌రావు తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ హెడ్ రమాదేవి, ఫ్యాకల్టీ అడ్వయిజర్ పీఆర్‌సీ గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

కేయూ దూరవిద్య డిగ్రీ ఫీజుల గడువు 24

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో దూరవిద్యా కేంద్రం- 2023 విద్యాసంవత్సరానికిగాను డిగ్రీ కోర్సుల్లో బీఏ, బీఎస్సీ, బీబీఏ, బీకాం జనరల్, కంప్యూటర్ ద్వితీయ, తృతీయ సంవత్సరం కోర్సులకు టర్మ్ ఫీజుల చెల్లింపు గడువు ఈనెల 24వరకు ఉందని రిజిస్ట్రార్, దూరవిద్యాకేంద్రం డైరెక్టర్ టి.శ్రీనివాస్‌రావు కోరారు. ఇటీవల డిగ్రీ కోర్సుల ప్రథమ సంవత్సరం పరీక్షలు రాసిన విద్యార్థులు ఈ టర్మ్ ఫీజులు చెల్లించాలని ఆయన సూచించారు. ఆయా డిగ్రీ కోర్సుల విద్యార్థులు పరీక్షల ఫలితాల కోసం వేచి చూడకుండా కోర్సుల రుసు ము (పరీక్ష ఫీజుతో సహా సంవత్సరం ఫీజు) చెల్లించి పుస్తకాలు పొందాలన్నారు. ఫీజులను ఎస్‌బీఐ, యూబీఐ ద్వారా డైరెక్టర్ , ఎస్‌డీఎల్‌సీఈ, కాకతీయ యూనివర్సిటీ పేరున కేయూ బ్రాంచీ ఐఎఫ్‌సీ కోడ్ (ఎస్‌బిఐఎన్ 0020262)వరంగల్‌నందు చెల్లుబాటు అయ్యేలా తీయాలని, దూరవిద్యా కేంద్రంలోని ఎస్‌బీఐ ఎక్స్‌టెన్షన్ కౌంటర్‌లోనుంచి చలానా ద్వారా కూడా ఫీజు చెల్లించవచ్చునని వివరించారు. మరిన్ని పూర్తి వివరాలకు ఫోన్‌నంబర్ 087024 61480, 2461490లలో సంప్రదించవచ్చునని ఆయన సూచించారు. త్వరలోనే అధ్యయన తరగతులు ప్రారంభం అవుతాయని శ్రీనివాస్‌రావు తెలిపారు.

సంక్షేమ పాలన వైఎస్సార్‌టీపీతోనే సాధ్యం



మానుకోట మండలంలో పాదయాత్ర చేస్తున్న వైఎస్ షర్మిల



బోరింగ్‌తండా వద్ద దివ్యాంగుడితో మాట్లాడుతున్న షర్మిల

- వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్.షర్మిల

మహబూబాబాద్ రూరల్: దివంగత సీఎం వైఎస్.రాజశేఖరరెడ్డి అమలు చేసిన సంక్షేమ పాలన తెలంగాణలో రావాలంటే వైఎస్సార్‌టీపీతోనే సాధ్యమని వైఎస్సార్ తెలంగాణ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. ఆమె చేపట్టిన ప్రజాప్రస్థానం పాదయాత్ర శనివారం 240వ రోజు నెల్లికుదురు మండలంలోని బంజర క్రాస్‌రోడ్, సంధ్య తండా, నర్సింహులగూడెం క్రాస్‌రోడ్, ఆలేరు, వావిలాల, కస్నాతండా, బలరాంతండా, అమనగల్, భజనతండా, బోరింగ్‌తండా, శనిగపురం గ్రామాల మీదుగా మహబూబాబాద్ జిల్లా కేంద్రం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ప్రజాసభలో షర్మిల మాట్లాడారు. వైఎస్సార్ సంక్షేమాన్ని ప్రతి ఇంటికి చేర్చడం కోసం ఈ ప్రజాప్రస్థానం పాదయాత్ర చేపట్టామన్నారు. ఫీజు రియింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, రుణమాఫీ, పోడు రైతులకు పట్టాలు, 108, 104, ఇందిరమ్మ ఇళ్లు ఇలా చెప్పుకుంటూ పోతే ప్రతి కుటుంబానికి ఏదో ఒక విధంగా రాజన్న పాలనలో సంక్షేమ పథకం అమలైందని గుర్తుచేశారు. తెలంగాణలో ప్రజల ఆకాంక్షల మేరకు కేసీఆర్ పాలన లేదని విమర్శించారు. కేసీఆర్ సర్కార్ పోవాలని.. వైఎస్సార్ బిడ్డగా తనను ఈ ప్రాంత ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. ఇప్పటికి రెండుసార్లు కేసీఆర్‌కు అవకాశం ఇచ్చారని, ఎనిమిన్నర సంవత్సరాల కాలంలో ఏ ఒక్కమాట నిలబెట్టుకోలేదన్నారు. ఈసందర్భంగా రైతులు, ప్రజలు, యువకులు షర్మిలతో సెల్ఫీలు దిగేందుకు పోటీ పడ్డారు. మానుకోట ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ అవినీతి అక్రమాలకు పాల్పడుతూ భూకబ్జాలు చేస్తున్నారని, గుట్కా, లిక్కర్, ఇసుక, బెల్లం , పీడీఎస్ బియ్యం మాఫియాలతో సంపాదించుకుంటున్నారని ఆరోపించారు. మానుకోట ప్రజలకు ఒక దిక్కుమాలిన ఎమ్మెల్యే ఉన్నాడని, గతంలోనే ఒక ఐఏఎస్ అధికారి చేయిపట్టుకున్నాడని అన్నారు. మాలోతు కవితకు 2009లో వైఎస్సార్ ఎమ్మెల్యేగా టిక్కెట్ ఇచ్చి గెలిపించి, రాజకీయ భిక్షపెడితే నేడు అది మర్చిపోయి ఎంతో హీనంగా మాట్లాడుతుందని పేర్కొన్నారు. ఎంపీగా ఆమెకు ఏడాదికి రూ.5కోట్లు నిధులు వస్తే ఎక్కడ ఖర్చు చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బందిపోట్ల రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) అని పార్టీ పెట్టి దేశం మొత్తం దోచుకుతినేందుకు కేసీఆర్ బయల్దేరారని విమర్శించారు. ఈ యాత్రలో వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పిట్టా రాంరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షురాలు సుజాతమంగీలాల్, పార్టీ నియోజకవర్గ కన్వీనర్ రాములునాయక్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు రామునాయక్, పఠాన్, నీలం సుధాకర్, విజయ్‌భాస్కర్‌రెడ్డి, కల్పన గాయత్రి, రాధారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అవిశ్వాసం దిశగా..

- పలువురు కౌన్సిలర్ల తీవ్ర ప్రయత్నాలు
- పెరుగుతున్న మద్దతుదారుల సంఖ్య
- 21న కౌన్సిల్ సాధారణ సమావేశం తర్వాత తుది నిర్ణయం

మహబూబాబాద్: మానుకోట మున్సిపాలిటీలో అవిశ్వాసం తీర్మానం పెట్టేందుకు అధికార పార్టీకి చెందిన కొంత మంది కౌన్సిలర్లు తీవ్రప్రయత్నాలు చేస్తున్నారు. రహస్య భేటీతో ముందుకెళ్తున్న వీరికి కౌన్సిలర్ల మద్దతు సంఖ్య కూడా పెరుగుతున్నట్లు సమాచారం. మానుకోట మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మహ్మద్ ఫరీద్ విషయంలో అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్లు అసంతృప్తితో ఉన్నారు. వారు అవకాశం కోసం ఎదురు చూస్తున్న క్రమంలో పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేసి మూడేళ్లు పూర్తయింది. ఈక్రమంలో ఈనెల 17న అధికార పార్టీ కౌన్సిలర్ ఎడ్ల వేణుమాదవ్ నివాసంలో కౌన్సిలర్ సలీంతో పాటు పలువురు కౌన్సిలర్ రహస్య భేటీ అవిశ్వాసంపై చర్చించినట్లు తెలిసింది. ఈ రహస్య భేటీలో ఎన్నికలలో గెలిచి పనులు చేయలేకపోతున్నామనే అంశాలతోపాటు కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం కౌన్సిలర్లను కూడగట్టుకొని అవిశ్వాసం పెట్టాలనే అంశంపై చర్చించిన్నట్లు సమాచారం.

21న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ఈనెల 21 మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించనున్నారు. దాని తర్వాత మళ్లీ కౌన్సిలర్లతో సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకుంటామని కొంత మంది అసంతృప్తి కౌన్సిలర్లు చెబుతున్నారు. అయితే ఏ నిర్ణయమైనా కౌన్సిల్ సమావేశం అనంతరమే తీసుకోనున్నట్లు స్పష్టంగా తెలుస్తుంది. ఇదిలా ఉండగా.. మున్సిపల్‌లో అవిశ్వాసం వరకు రాకుండా అంతకుముందే ఎమ్మెల్సీ, ఎంపీ, ఎమ్మెల్యే అసంతృప్త కౌన్సిలర్లతో మాట్లాడి విషయం సద్దుమనిగేలా చేస్తారా.. లేదా అనేది వేచిచూడాలి.

అధికార పార్టీ కౌన్సిలర్ల సంఖ్య 25

మానుకోట మున్సిపాలిటీలో పార్టీల వారీగా ప్రస్తుతం కౌన్సిలర్ల సంఖ్యను పరిశీలిస్తే బీఆర్‌ఎస్‌కు 26 మంది ఉండగా ఇటీవల కౌన్సిలర్ రవి మృతి చెందగా వారి సంఖ్య 25కు తగ్గింది. కాంగ్రెస్‌కు 6, సీపీఐ 2, సీపీఎంకు ఇద్దరు చొప్పున ఉన్నారు. కౌన్సిలర్లలో కొంతమంది ఎమ్మెల్యే వర్గంలో మరి కొంత మంది ఎంపీ వర్గంలో, మరికొంత మంది ఎమ్మెల్సీ వర్గంలో ఉండడం గమనార్హం. ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు ప్రధాన అనుచరుడైన ఎడ్ల వేణు మాదవ్ ఇంట్లో రహస్య సమావేశం నిర్వహించడం చర్చాంశనీయంగా మారింది.



మానుకోట మున్సిపల్ కార్యాలయం

మద్దతు కోసం ప్రయత్నాలు

అవిశ్వాసం కోసం ప్రయత్నం చేస్తున్న కౌన్సిలర్లు ఎడ్ల వేణు మాదవ్, సలీం తమతో పాటు అధికార పార్టీకి చెందిన మరో ఎనిమిది కౌన్సిలర్లు తమ వెంటనే ఉన్నారని చెబుతున్నారు. వారితో పాటు ఈనెల 18న సీనియర్ కౌన్సిలర్లు ఇద్దరు టచ్‌లోకి వచ్చారు. అయితే వీరందరి వెనుక ప్రముఖ వ్యక్తులు ఉన్నట్లు తెలుస్తుంది. కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం కౌన్సిలర్లు కూడా టచ్‌లో ఉన్నారని వారు చెబుతుండగా ఆ పార్టీల కౌన్సిలర్లు మాత్రం టచ్‌లో లేమని చెబుతుండడం గమనార్హం.

వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం?

అధికార పార్టీ కౌన్సిలర్లతో పాటు ఇతర పార్టీల్లోని కౌన్సిలర్లలో కొంతమంది చైర్మన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం కోరుతుండగా.. ఎక్కువ మంది వైస్ చైర్మన్‌పైనే అవిశ్వాసం పెట్టాలని కోరుతున్నట్లు తెలుస్తుంది.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

బయ్యారం: చదువుతోపాటు క్రీడల్లో యువత రాణించాలని ఇల్లందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ అన్నారు. మండలంలోని టేకులగూడెంలో శనివారం ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం మొట్లతిమ్మాపురంలో నిర్వహించిన క్రీడల్లో గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇస్తూ క్రీడల్లో రాణిస్తున్నవారికి ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇస్తున్నారన్నారు. వైస్ ఎంపీపీ గణేష్, సర్పంచ్ క్రిష్ణవేణి, సొసైటీ ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, సోమిరెడ్డి, శ్రీను, మండల అధ్యక్షుడు ఉప్పలయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



వాలీబాల్ క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

క్లుప్తంగా

యువతికి విద్యుత్‌ షాక్‌


అపస్మారక స్థితిలోకి వెళ్లిన యువతి

కురవి: భద్రకాళీ సమేత శ్రీ వీరభద్ర స్వామి కల్యాణ వేడుకలను తిలకించేందుకు వచ్చిన భక్తులు కల్యాణ వేదిక మైదానంలో కూర్చుండగా విద్యుత్‌ షాక్‌కు గురైన ఓ యువతి అపస్మారక స్థితిలోకి వెళ్లిన సంఘటన శనివారం రాత్రి మండల కేంద్రంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. నర్సింహులపేట మండలం పెద్ద నాగారం గ్రామానికి చెందిన నిర్మల కల్యాణాన్ని తిలకించేందుకు విద్యుత్‌ దీపాలు అమర్చిన రాడ్ల పక్కన కూర్చుంది. ఒక్కసారిగా ఆ దీపాలకు అమర్చిన రాడ్లకు విద్యుత్‌ సరఫరా కావడంతో దాన్ని ఆనుకుని కూర్చున్న యువతికి షాక్‌ తగిలింది. దీంతో వెంటనే ఆమె కింద పడిపోయింది. గమనించిన భక్తులు పోలీసులకు తెలుపడంతో డోర్నకల్‌ సీఐ వెంకటరత్నం, ఆర్డీఓ కొమురయ్యలు స్పందించారు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన యువతిని ఆర్డీఓ వాహనంలో మహబూబాబాద్‌ జనరల్‌ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం యువతి ఆరోగ్యం నిలకడగానే ఉంది. వెంటనే కల్యాణవేదిక వద్ద విద్యుత్‌ సౌకర్యాన్ని కట్‌ చేసి మరమ్మతులు చేపట్టారు.

బొగ్గు లారీ బోల్తా


బ్రిడ్జిపై నుంచి పడిన బొగ్గు లారీ

మల్హర్‌ : బొగ్గు లారీ అదుపు తప్పి మండలంలోని కొయ్యూరు బొగ్గుల వాగు మానేరులో పడింది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. శనివారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖని నుంచి భూపాలపల్లికి బొగ్గు లోడుతో వెళ్తున్న లారీ కొయ్యూరు నాగులమ్మ సమీపంలోని బొగ్గుల వాగు బ్రిడ్జి వద్ద అదుపు తప్పి బ్రిడ్జి మీద నుంచి వాగులో పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాకుండా సురక్షితంగా బయటపడ్డాడు.



తెలంగాణ పోలీసింగ్‌ దేశానికే ఆదర్శం


మదర్‌ అండ్‌ చైల్డ్‌ ఫ్రెండ్లీ రూమ్‌ ను ప్రారంభిస్తున్న మంత్రి సత్యవతి రాథోడ్‌


పిల్లలకు ఆటవస్తువులు ఇస్తున్న మంత్రి సత్యవతి రాథోడ్‌

- మంత్రి సత్యవతి రాథోడ్‌
- రాష్ట్రంలో మొదటిసారిగా మదర్‌ అండ్‌ చైల్డ్‌ ఫ్రెండ్లీ రూమ్‌ ఏర్పాటు
- ఎస్పీని అభినందించిన మంత్రి

మహబూబాబాద్‌ రూరల్‌ : శాంతి భద్రతల పరిరక్షణలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌ అన్నారు. జిల్లా కేంద్రంలోని టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ ఆవరణలో ఏర్పాటు చేసిన మదర్‌ అండ్‌ చైల్డ్‌ ఫ్రెండ్లీ గదిని శనివారం ఆమె ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌ ప్రత్యేక ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన వెంటనే అభివృద్ధితో పాటు పోలీస్‌ వ్యవస్థ ఆధునీకరణపై దృష్టి సారించారన్నారు. ఆయన దిశా నిర్దేశంలో రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ నడుం బిగించిందని పేర్కొన్నారు. ఫిర్యాదులు చేయడానికి, దోషులను కలవడానికి, పోలీస్‌ స్టేషన్‌కు చిన్నారులతో వచ్చే మహిళలు ఇబ్బందులు పడకుండా ఈ ప్రత్యేక రూమ్‌ ఉపయోగపడుతుందని తెలిపారు. పిల్లలకు పోలీస్‌ స్టేషన్‌ భావన కలుగకుండా ఆడుకోవడానికి, చిన్నారులు నిద్రించడానికి ఈ ప్రత్యేకరూమ్‌ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన జిల్లా ఎస్పీ శరత్‌ చంద్ర పవార్‌ ను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. తెలంగాణ పోలీసులు ఫ్రెండ్లీ పోలీస్‌ అని పోలీస్‌ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం కలిగిస్తున్నారని తెలిపారు. ఫిర్యాదుల కోసం పౌరులు స్వేచ్ఛగా పోలీసులను ఆశ్రయిస్తున్నారని స్పష్టం చేశారు. మహిళల కోసం ప్రత్యేక ఇంటర్వ్యూ గదిని, మహిళా సిబ్బందిని ఏర్పాటు చేయడంతో మహిళలు వారి సమస్యలను ఎటువంటి సంకోచం లేకుండా వచ్చి చెప్పే విధంగా సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తెలంగాణలో మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత నిస్తూ షీ టీమ్‌ లను, సఖి సెంటర్‌, భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ఏర్పాటుకు ముందు పోలీస్‌ వ్యవస్థ మొత్తం చీకటిలో ఉండేదని, అరకొర జీతాలతో, సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులతో ఉందన్నారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీస్‌ స్టేషన్‌కు ఎంతో మంది మహిళలు పిల్లలతో వస్తుంటారని, ఆడవారు వారి పిల్లలతో స్టేషనుకు వచ్చినప్పుడు వాళ్లకు (సేఫ్‌ అండ్‌ సెక్యూర్‌ ఎన్విరాన్మెంట్‌) మంచి వాతావరణం కల్పించేందుకు ఈ ప్రత్యేకమైన గది ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీ మాలోత్‌ కవిత, ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్‌ రావు, ఎమ్మెల్యే బానోత్‌ శంకర్‌ నాయక్‌, కలెక్టర్‌ శశాంక, టౌన్‌ సీఐ ఎడ్లపల్లి సతీష్‌, సీడబ్ల్యూసీ చైర్‌ పర్సన్‌ డాక్టర్‌ ఎస్‌.నాగవాణి, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ ప్రధాని కావాలని ప్రత్యేక పూజలు


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

వరంగల్‌ (పర్వతగిరి) : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు దేశ ప్రధాని కావాలని కోరుకుంటూ రాష్ట్ర పంచాయతీరాజ్‌, గ్రామీణాభివృద్ధి, తాగునీటి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్‌తో కలిసి పర్వతగిరిలోని పర్వతాల శివాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజలు చేసిన అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అభివృద్ధిలో మొదటి స్థానంలో ఉందన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందిన విధంగా దేశం కూడా అభివృద్ధి చెందాలంటే ప్రధానిగా కేసీఆర్‌ను దేశ ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ముఖ్యంగా రైతులు కేసీఆర్‌ ప్రధాని కావాలని కోరుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. యాదాద్రి, వేములవాడ, కొండగట్టును గత పాలకులు పట్టించుకోలేదని సీఎం కేసీఆర్‌ పట్టించుకొని ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు.

సజీవంగా కనిపిస్తున్న బైబిల్‌

- అపోస్తలులు ప్రపంచమంతా సువార్తను బోధించారు
- మరియపురం అభివృద్ధిని పోప్‌ దృష్టికి తీసుకెళ్తా
- వరంగల్‌ పీఠాధిపతి బిషప్‌ ఉడుముల బాల


చర్చి తోరణాన్ని ప్రారంభిస్తున్న బిషప్‌ ఉడుముల బాల

గీసుకొండ : మరియపురం లూర్దుమాత దేవాలయం ముందు భాగంలో నెలకొల్పిన అపోస్తలులు, పునీత ఆంథోని, తిరుకుటుంబ విగ్రహాలు, కల్వరి క్రాస్‌..ఇవన్నీ చూస్తుంటే ఇక్కడ బైబిల్‌ సజీవంగా కనిపిస్తున్నట్లు ఉందని రోమన్‌ క్యాథలిక్‌ వరంగల్‌ పీఠాధిపతి బిషప్‌ ఉడుముల బాల అన్నారు. శనివారం మరియపురంలో లూర్దుమాత దేవాలయం తోరణం, కల్వరి క్రాస్‌, 12 అపోస్తలులుతో పాటు పలు విగ్రహాలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం చర్చి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ విగ్రహాలను చూస్తుంటే మోక్షానికి వచ్చిన ఆనందంగా ఉందన్నారు. ఇవన్నీ చూస్తుంటే బైబిల్‌లోని అన్ని విషయాలు మనకు బోధపడేలా ఉన్నాయని అభినందించారు. ఏసుక్రీస్తు శిష్యులు అపోస్తలులు ప్రపంచమంతా సువార్తను బోధించారన్నారు. సర్పంచ్‌ బాలిరెడ్డి కృషితో మరియపురం హరితవనంగా మారి ఎంతో అభివృద్ధి సాధించి రాష్ట్ర, జాతీయస్థాయిలో గుర్తింపు పొందిందన్నారు. గ్రామఅభివృద్ధిని తాను పోప్‌ దృష్టికి తీసుకెళ్లడానికి ఆయనకు ఉత్తరం రాయాలని అనుకుంటున్నానని చెప్పారు. ఉడుముల బాలను సర్పంచ్‌ బాలిరెడ్డితో పాటు పలువురు విచారణ గురువులు సన్మానించారు. అల్లం నిర్మలాదేవి, చర్చి పాదర్‌ అన్నపురెడ్డి రాజారెడ్డి, విచారణ గురువులు బాసాని ప్రకాశ్‌, చిన్నపురెడ్డి, వాసం శౌరెడ్డి, గోపు ప్రకాశ్‌, కమల్‌ తదితరులు పాల్గొన్నారు.

దేవన్నపేటలో పట్టపగలే చోరీ

- ఐదు తులాల బంగారు ఆభరణాలు మాయం

హసన్‌పర్తి : మండలంలోని దేవన్నపేటలో శనివారం పట్టపగలే చోరీ జరిగింది. ఈ ఘటనలో సుమారు ఐదు తులాల బంగారు ఆభరణాలతో పాటు రూ. 3 వేల నగదును దోచుకెళ్లారు. స్థానికుల కథనం ప్రకారం..దేవన్నపేటకు చెందిన పెద్దపల్లి కిరణ్‌కుమార్‌ ఆటోడ్రైవర్‌గా పనిచేస్తుండగా భార్య జ్యోతి దినసరి కూలీ. శనివారం ఉదయం భార్యభర్తలు వారి వారి పనులకు వెళ్లారు. మధ్యాహ్నం 12.30 గంటల ప్రాంతంలో ఇద్దరు పిల్లలకు ఇంటికి తాళం వేసి అదే ప్రాంతంలో ఉంటున్న చిదురాల రాజు ఇంటికి పిల్లలు చేరుకున్నారు. మధ్యాహ్నం 2.30 గంటల ప్రాంతంలో పనులు ముగించుకుని జ్యోతి ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి కనిపించాయి. లోపలికి వెళ్లి చూడగా బంగారు ఆభరణాలు కనిపించకుండా పోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కిరణ్‌ కుమార్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రావుల నరేందర్‌ తెలిపారు.

రైతును బలి తీసుకున్న ముళ్లకంచె

- అడవిపందుల నివారణకు ఏర్పాటు చేసిన రైతు
- విద్యుదాఘాతంతో పక్కపొలం రైతు మృతి


నర్సింహులు (ఫైల్‌)

బచ్చన్నపేట : పంటలను కాపాడుకోవడానికి అడవిపందుల నివారణకు పొలం చుట్టూ ఉన్న ఇనుప ముళ్లకంచెకు కరెంటు షాక్‌ పెట్టగా దానిని గమనించక పక్క పొలం రైతు తాకి చనిపోయిన సంఘటన మండలంలోని బసిరెడ్డిపల్లిలో శుక్రవారం రాత్రి జరిగింది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బండకింది నర్సింహులు (42) అదే గ్రామానికి చెందిన వంగపల్లి రవీందర్‌రెడ్డి వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకొని సేద్యం చేస్తున్నాడు. రోజు మాదిరిగానే సాయంత్రం వ్యవసాయ భూమిలో నాటు పెట్టిన వరి పొలంలో నీరు చూడడానికి వెళ్లాడు. పక్క భూమి గల బండారు రాజయ్య అనే రైతు పంట రక్షణకు అడవిపందుల నివారణకు పొలం చుట్టూ ఉన్న ఇనుప ముళ్లకంచెకు కరెంటు షాక్‌ పెట్టాడు. అది గమనించని నర్సింహులు ఇనుపకంచె తగిలి కరెంటు షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. రాత్రి వరకు ఇంటికి రాకపోయేసరికి పొలం వద్దకు వెళ్లి చూడగా కరెంటు షాక్‌తో మృతి చెంది విగత జీవిలా పడి ఉన్నాడు. మృతుడికి భార్య లావణ్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. నర్సింహులు మృతికి కారణమైన రాజయ్యపై చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు. పోలీసుల జోక్యంతో ధర్నాను విరమించుకున్నారు.

కన్యాదానం చేయకముందే ఆగిన గుండె

- మార్చి 9న కూతురు వివాహం
- గుండెపోటుతో తండ్రి మృతి
- పెద్దపహాడ్‌లో విషాదం


లక్ష్మినారాయణ (ఫైల్‌)

జనగామ రూరల్‌ : కాళ్లు కడిగి కన్యాదానం చేయాల్సిన తండ్రి హఠాత్తుగా మరణించడంతో ఆ కుటుంబంలో విషాదం నింపిన సంఘటన మండలంలోని పెద్దపహాడ్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం..పెద్దపహాడ్‌కు చెందిన గౌరమైన లక్ష్మినారాయణ (50) మేకలు మేపుతూ, వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సొంతంగా 30 వరకు మేకలు ఉన్నాయి. అతనికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. కాగా కూతురుకు వివాహం నిశ్చయమైంది. మార్చి 9న వివాహ ముహూర్తం పెట్టుకున్నారు. రోజు మాదిరిగానే మేకలు షెడ్‌లోకి తీసుకెళ్లాడు. జనవరి 4న తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు ఏడు మేకలను ఎత్తుకెళ్లారు. అదే అదనుగా చూసిన దుండగులు మరోమారు ఫిబ్రవరి 9న మరో 10 మేకలు, రెండు పోతులు అపహరించారు. మరుసటి రోజు పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడు. రెండుసార్లు మేకలను దొంగిలించడంతో మనస్థాపం చెందాడు. దీంతో ఒక్కసారిగా గుండెపోటు రావడంతో వరంగల్‌ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. దీంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. మృతుడికి భార్య యాదలక్ష్మి ఉంది.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య


నరేష్‌ (ఫైల్‌)

కాశిబుగ్గ : భార్యభర్తల మధ్య గొడవలతో తీవ్ర మనస్తాపానికి గురై భర్త గూడ్స్‌ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన చింతలపల్లి, వరంగల్‌ రైల్వేస్టేషన్ల మధ్య శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. జీఆర్పీ సీఐ నరేష్‌ తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని కాశిబుగ్గకు చెందిన అరికాల నరేష్‌(32) ఏడేళ్ల క్రితం నవ్యశ్రీని వివాహం చేసుకున్నాడు. కూరగాయల మార్కెట్‌లో కూలీగా పని చేస్తు జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలంగా నరేష్‌ పని చేయకుండా మద్యానికి బానిస అయ్యాడు. ఈ క్రమంలో వారం క్రితం భార్యభర్తల మధ్య గొడవ జరిగి భార్య భర్తను వదిలిపెట్టి మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో గత గురువారం మహిళా పోలీసులు ఇరువురుని స్టేషన్‌కు పిలిపించి కలిసి ఉండాలని కౌన్సెలింగ్‌ ఇచ్చారు. గొడవలతో తీవ్ర మనస్థాపానికి గురైన నరేష్‌ శుక్రవారం అత్తకు ఫోన్‌ చేసి తన పాపతో మాట్లాడి రాత్రి ధర్మారం శ్మశానవాటిక ఎదురుగా ఉన్న రైల్వే ట్రాక్‌పైకి వెళ్లి గూడ్స్‌ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. డిప్యూటీ ఎస్‌ఎస్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహన్ని ఎంజీఎంలో పోస్టుమార్టం నిర్వహించి శనివారం భార్య నవ్యశ్రీకి అందజేశామని సీఐ తెలిపారు.

కాజీపేటలో వివాహిత ..

కాజీపేట: పట్టణంలోని 63వ డివిజన్‌ విష్ణుపురి కాలనీలో నివాసం ఉండే వివాహిత ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఇన్‌స్పెక్టర్‌ గట్ల మహేందర్‌రెడ్డి తెలిపారు. మృతురాలి తండ్రి నలిగంటి మైసయ్య శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పుష్కరకాలం కింద జింగా వేణును ప్రేమించి పెళ్లి చేసుకున్న రజనికి దీర్ఘకాలికంగా థైరాయిడ్‌ సమస్య వేధిస్తోంది. ఆ వ్యాధి మందులకు తగ్గకపోవడంతో మనస్తాపానికి గురైన రజని ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పేర్కొన్నారు. మృతురాలికి భర్త, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

అప్పులు చేశా.. చనిపోతున్నా

- లెటర్‌ రాసి అదృశ్యమైన రైతు
- తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు


సాంబశివుడు

గీసుకొండ: తాను అప్పులు చేశానని..చనిపోతున్నా అని లెటర్‌ రాసి ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ రైతు కనిపించకుండా పోయిన ఘటన మండలంలోని కొనాయమాకులలో శుక్రవారం చోటు చేసుకుంది. అదృశ్యమైన వ్యక్తి తండ్రి కథనం ప్రకారం..కొనాయమాకులకు చెందిన లకిడె సాంబశివుడు (31) రైతు చిక్కుడుకాయలను టాటా ఏస్‌ వాహనంలో వరంగల్‌ కూరగాయల మార్కెట్‌కు శుక్రవారం రాత్రి 7 గంటల సమయంలో అమ్మకానికి తీసుకునివెళ్లాడు. మార్కెట్‌కు చేరుకున్న తర్వాత టాటా ఏస్‌ వాహనాన్ని తిరిగి పంపించిన అతడు తిరిగి ఇంటికి రాకపోగా సెల్‌ఫోన్‌ స్విచాఫ్‌ చేసుకున్నాడు. శనివారం ఉదయం అతడి భార్య అనూష ఇంటివాకిలి ఊడుస్తుండగా ద్విచక్ర వాహనం వద్ద ఓ చీటీ కనిపించగా అందులో సాంబశివుడు తాను అప్పులు చేశానని, చనిపోతున్నానని రాశాడని గుర్తించింది. అతడి ఆచూకీ తెలపాలని కోరుతూ తండ్రి శంకర్‌రావు ఫిర్యాదు చేయగా మిస్సింగ్‌ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ సట్ల రాజు తెలిపారు.

శివనామస్మరణం..

హనుమకొండ వేయిస్తంభాల ఆలయంలో మొక్కుల కోసం బారులు తీరిన భక్తులు



కాళేశ్వరం గోదావరి నదిలో స్నానమాచరిస్తున్న భక్తులు



ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మహాశివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. భక్తుల రాకతో ఆలయాలు కిటకిటలాడాయి. ఉదయం నుంచి రాత్రి వరకు పిల్లలు మొదలుకొని పెద్దల వరకు తమ మొక్కులు చెల్లించుకున్నారు. శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. పార్వతీ పరమేశ్వరుని కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఆలయాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

- సాక్షి నెట్‌వర్క్‌


రామప్ప ఆలయంలో మొక్కుల కోసం క్యూ కట్టిన భక్తులు


మడికొండ మెట్టుగుట్ట ఆలయంలో భక్తుల పూజలు


పాలకుర్తిలోని సోమేశ్వరాలయం వద్ద భక్తుల కోలాహలం


ఖిలావరంగల్‌ శంభులింగేశ్వరస్వామి ఆలయంలో...

సాక్షి క్లాసిఫైడ్స్‌

EDUCATION

FREE TRAINING

■ PRAISE THE LORD: పేద అమ్మాయిలకు HYD - కూకట్‌పల్లిలో ఫ్రీ వసతితో HR +మీడియా+ డిజి॥ మా॥ +అకౌంట్స్‌ +కంప్యూటర్‌లో 120డేస్‌ ట్రైనింగ్‌, తర్వాత వర్క్‌ఫ్రమ్‌ హోమ్‌ ఆదాయం. డిగ్రీ+ స్మార్ట్‌ ఫోన్‌ మస్ట్‌. ఫోన్‌: 9182242932 [HA-2415]

REAL ESTATE

HOUSE FOR SALE

■ Kazipet Main Road 3 Stored building (G + 2 + Pent House) with 2800 Sft. Constructed on 107 Sq.Yds. Suitable for Business / Residence. Cell: 9160591961. [WA-3409]

FLAT FOR SALE

■ భీమారం మేన్‌రోడ్‌ Reliance Trends షాపింగ్‌ మాల్‌ ప్రక్క సందులో మేన్‌రోడ్‌ నుండి 3 ని॥ దూరంలో నూతనంగా నిర్మించిన శ్రీలక్ష్మి నివాస్‌ నందు 2 BHK & 3BHK Flats అమ్మకానికి కలవు. Good Ventilation. Ready to occupy. సంప్ర॥ 9849101554 [WA-2919]

PLOT FOR SALE

■ మామునూర్‌లో అభివృద్ధి చేసిన కుడా లేఅవుట్‌ 263, 228, 200 గజాలు ప్లాట్లకై సంప్రదించండి: సెల్‌: 9032111600. [W-775782]

■ వరంగల్‌ ములుగురోడ్‌ నుంచి 1 కిలోమీటర్‌ దూరంలో అయ్యప్పస్వామి గుడి దగ్గరలో ఉన్న ఆకృతి Enclave లో 275 చ॥గ॥ లేఅవుట్‌ ప్లాట్‌ అమ్మబడును. సంప్ర॥ 9849101554. [WA-2929]

■ హన్మకొండ, గోపాల్‌పూర్‌ కల్లు మండువ దగ్గరలో విద్యాధరి స్కూల్‌ ప్రక్కన EAST ఫేసింగ్‌ 110 ఫీట్లు మేన్‌రోడ్డుకు సెకండ్‌ బిట్‌ గల 1000 చ॥గ॥ ప్లాట్‌ అమ్మబడును. సంప్ర॥ 9849101554. [WA-2928]

■ HMDA Approved Open Plots for Sale at Ghatkesar, BibiNagar. Contact Cell: 9000182326 / 9705694440. [H-792739]

■ About 250 Sq.Yards to 500 Sq.Yards Residential Plot for Sale. Near NIT, Beside Bishop Beretta School, Fatimanagar. Contact Jayaraju: 9989635057 or Praveen: 8008422520. [HA-10057]

■ హైదరాబాద్‌, ఇబ్రహీంపట్నం - జనహర్ష డ్రీమ్‌ సిటీ- 1 & 2 లోని ప్లాట్లు అమ్మబడును మరియు కొనబడును. సంప్ర: 9247266234, 8886972345. [H-793508]

LEASE కి ఇవ్వబడును

■ Commercial Building For Lease located in Warangal Chowrasta. G+ 1st + 2nd Floors. G Floor= 2324, 1st= 2881, 2nd= 2881. Total 7886 Sq.Fts. Suitable for Banks, Gold Show Room, Cloth Showroom, Corporate Offices. 9949439492 [W-775831]

VILLA FOR SALE

■ 4 BHK, North Facing, 300 Sq.Yrds Luxury Villa for Sale in HNK, Warangal. Cost: 5 Cr. Call: 9866295406. [W-1170523]

SERVICES

■ అనారోగ్యంతో మంచంలో ఉన్న వృద్ధులకు/సామాన్య వృద్ధులకు అన్ని వసతులు & వైద్య సౌకర్యంతో గదులు కలవు. సాయిసేవా ట్రస్ట్‌, వడ్డేపల్లి, హనుమకొండ. సెల్‌: 9848444020, 9949189357. [W-775779]

FINANCE

■ హౌజ్‌, ఫ్లాట్‌, వ్యవసాయ భూములు మార్టిగేజ్‌ చేసుకొని వారంలో అమౌంట్‌ ఇప్పించబడును. ఔట్‌సోర్సింగ్‌, కాంట్రాక్ట్‌ వారికి చేయబడును. హన్మకొండ. సెల్‌: 7842279342. [WA-6484]

WANTED

■ ప్రముఖ కృష్ణవేణి రెసిడెన్షియల్‌ జూనియర్‌ కాలేజ్‌, నక్కలగుట్ట, హన్మకొండలో కావలెను. (1) Asst. వంట మాస్టర్‌, (2) ఆటో ట్రాలీ డ్రైవర్‌, (3) ఆయాలు, (4) వాచ్‌మెన్‌ అర్జెంటుగా కావలెను. 9949610729. [WA-6496]

■ Wanted Sales Executive for Delicious Farms Chicken Outlets in Warangal Required Sales Related Experience in any Domain. Salary + Bonus. Age: 25 - 35 yrs. Timings: 8AM - 7 PM. Cont: 8106112401 [W-775827]

■ సాయిశ్రీ జిరాక్స్‌, కిషన్‌పురలో పని చేయుటకు జిరాక్స్‌ నందు అనుభవం ఉన్న స్త్రీలు/ పురుషులు కావలెను. సాలరీ: 10,000/- Full Time. Cont: 9032178357. [WA-6497]

■ Wanted Agents: HNK లో నూతనంగా నిర్మించిన అపార్ట్‌మెంట్‌ నందు Flats అమ్మడానికి ఏజెంట్స్‌ కావలెను. మంచి కమీషన్‌ ఇవ్వబడును. Cont: 9849101554. [WA-2918]

■ వరంగల్‌లోని కిరాణం షాప్‌ నందు పని చేయుటకు 3 సం॥ల అనుభవం కల్గిన (స్త్రీ/పు) కావలెను. వరంగల్‌ లోకల్‌ వారు మాత్రమే సంప్రదించండి. యువరాజ్‌ కిరాణం, వరంగల్‌. 9490133696 [W-775830]

■ వరంగల్‌ స్టేషన్‌రోడ్‌కు గల విష్ణు లాడ్జ్‌లో పని చేయుటకు మేనేజర్‌గా, సూపర్‌వైజర్‌గా 12 గం॥ డ్యూటీ సాలరీ: 10 వేలు ఇవ్వబడును. రిటైర్డ్‌ రైల్వే ఉద్యోగులు, RTC కండక్టర్స్‌, మొ॥వారికి ప్రాధాన్యత. 9391864657 [W-775819]

■ త్రివేణి హోంకేర్‌ హైదరాబాద్‌ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకోవడానికి వర్కర్స్‌, నర్సులు, కావలెను, ఫ్రీ వసతి+ భోజనం, జీ: 18 k ఏజెంట్స్‌ కమీషన్‌ 3k ఫోన్‌: 7569955551, 9848571888. [H-786836]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్‌ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్‌ కొరకు 9059509586 [G-781830]

■ విజయవాడలో A/c & Coolers రెంటల్‌ (towerac.com) కంపెనీకి A/c టెక్నీషియన్స్‌-3, దోస్త్‌ డ్రైవర్లు-3, హెల్పర్లు-5. జీతం: 18 - 25,000 ట్రైనింగ్‌/భోజనం/వసతి ఫ్రీ ✆ 90300 44646. [B-1226251]

■ విజయ హోం కేర్‌ HYDలో పెద్దవారికి సేవ చేయుటకు, బేబి కేర్‌, పేషెంట్‌ కేర్‌, ఇంటి/వంట పనికి స్త్రీ/పు, కావలెను. జీ: 16000-25000 (ఏజెంట్‌ కమీషన్‌ కలదు), రూం + మీల్స్‌ ఫ్రీ. 9491367222. [H-793511]

■ బ్రాహ్మణ స్త్రీలు మాత్రమే: వంట మనుషులకు - 25 వేలు, ట్యూషన్‌కు - 30 వేలు, ఇంటిపనికి: 15 వేలు, సంగీతపు టీచర్‌ - 25 వేలు. హైదరాబాద్‌. ఫ్రీ భోజనం + వసతి ✆ 98662 52220, 98492 52220 [B-331]

WANTED TEACHERS

■ Candidate should have fluency in English Interview Location: St. Mathew's High School, Madikonda, Cell No: 9866768854, 9701033866. [WA-6480]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ 9010144453
వరంగల్‌ 9705748198
నర్సంపేట 9505507558
జనగామ 9951602871
మహబూబాబాద్‌ 9010144453
జయశంకర్‌ భూపాలపల్లి 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌ / డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

4 లైన్ల క్లాసిఫైడ్‌ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము